సాక్షి తిరుపతి

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



ప్రజాస్వామ్య పాలన జగనన్నతోనే

భాకరాపేట: సీఎం జగనన్నతోనే నిజమైన ప్రజాస్వామ్యపాలన అని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు.

- 8లో



'మల్లాడి డ్రగ్స్'లో అగ్నిప్రమాదం

రేణిగుంట: గాజులమండ్యం కెమికల్ ఎస్టేట్‌లో ఉన్న మల్లాడి డ్రగ్స్ కర్మాగారంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	23
చిత్తూరు	40	23
తిరుమల	37	19
గూడూరు	42	26
నగరి	42	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం(ఉ)
తిరుపతి	6.29	4.36
చిత్తూరు	6.31	4.36
పుంగనూరు	6.33	4.40

నిప్పుల కొండ

పచ్చని చెట్లు.. చల్లని పిల్లగాలులు.. చేతికందే ఎత్తులో రివ్వున దూసుకెళ్లే మబ్బులు.. విరుల పరిమళాలు.. జలపాతాల సోయగాలతో విరాజిల్లే హరి నివాసం భానుడి ప్రతాపంతో వణికిపోతోంది. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో ఏటా ఎండ వేడిమి పెరగడంతో ఆహ్లాదకరంగా ఉండే వాతావరణం ఒక్కసారిగా మారిపోతోంది. గాలిలో తేమశాతం పడిపోవడంతో ఉక్కపోత పెరుగుతోంది. ఉదయం నుంచే మాడ వీధుల్లో భక్తులు ఎండ వేడిమిని తట్టుకునేలా టీటీడీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి వస్తోంది.



ఆలయం వెలుపల ఎండ తీవ్రతకు ఎర్ర కార్పెట్లపై నీళ్లుపడుతున్న సిబ్బంది



ఎండ తీవ్రతకు చిన్నారులపై టవళ్లు కప్పి తీసుకెళ్తున్న భక్తులు



- ఆధ్యాత్మిక క్షేత్రాన్ని తాకిన భానుడి తాపం
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా టీటీడీ పకడ్బందీ చర్యలు

తిరుమల: కలియుగ ఇల వైకుంఠంగా పేరుగాంచిన తిరుమల కొండపై ఆహ్లాదకర వాతావరణం భక్తులకు దివ్యానుభూతిని కలిగిస్తుంది. ఏటా వేసవిలో తిరుమలలో ఉష్ణోగ్రతలు 32 డిగ్రీలు మించి ఉండవు. గాలిలో తేమ శాతం 60 శాతం ఉండేది. కానీ కొన్ని సంవత్సరాలుగా తిరుమలలో నిర్మాణపరంగా అనేక మార్పులు చోటుచేసుకోవడంతో వాతావరణం వేడెక్కుతోంది. తాజాగా ఈ వేసవిలో తిరుమలలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే సూర్యుడు తన ప్రతాపాని చూపిస్తున్నాడు. ఏప్రిల్ మాసంలో ఉష్ణోగ్రత 38 నుంచి 40 డిగ్రీలకు వరకు పెరుగుతోంది. గాలిలో తేమశాతం 20 శాతానికి పడిపోయింది. దీంతో ఆహ్లాదకరంగా ఉండే వాతావరణం మండుతోంది. మాడ వీధుల్లో భక్తులు పాదరక్షలు లేకుండా నడవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎండ వేడిమి తట్టుకోలేక భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు.

భక్తుల కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు ఉపశమనం కలిగించడానికి టీటీడీ విస్తృత చర్యలు చేపట్టింది. మాడ వీధుల్లో ఇరువైపులా టీటీడీ సన్ ప్రూఫ్ పెయింట్ వేయడంతో పాటు ప్రతి గంటకూ ఒకసారి పైప్‌లైన్ స్ప్రింక్లర్ల ద్వారా నీళ్లు చిమ్మేలా ఏర్పాట్లు చేపట్టింది.
- ఎండ తీవ్రతను బట్టి తిరుమాడ వీధుల్లో తరచూ స్ప్రింక్లర్లతో నీటితో తడుపుతోంది.
- ఆలయానికి అభిముఖంగా భక్తులు సేదతీరే విధంగా టీటీడీ ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేసింది.
- కళ్యాణకట్ట, అన్నదానం తదితర ప్రాంతాలలో షెడ్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది.

ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్ట	గరిష్ట
12	26	36
13	26	37
14	26	38
15	26	37
16	27	37
17	27	38
18	26	35



చలువ పందిళ్ల కింద సేదతీరుతున్న భక్తులు



మాడవీధుల్లో తెలుపు రంగు పెయింట్ వేస్తున్న కార్మికులు



కార్పెట్ పై నడుస్తున్న భక్తులు

అట్రాసిటీ బాధితులకు అండ



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: అట్రాసిటీ బాధితులకు ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అండగా నిలుస్తోందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, డీఆర్వో శ్రీనివాసరావు, ఆర్డీవోలు కనకనరసారెడ్డి, రామారావు, కిరణ్‌కుమార్, చంద్రమునీరనాల్, కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, కమిటీ కన్వీనర్ చెన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022 జూన్ నుంచి 2023 మార్చి నాటికి జిల్లాలో ఎస్సీ,ఎస్టీకి సంబంధించిన కేసులు 85 నమోదయ్యాయన్నారు. బాధితులకు మానిటరీ రిలీఫ్ ద్వారా రూ.82.20 లక్షలు చెల్లించామని చెప్పారు. మరో 67 కేసులు పరిశోధన దశలో ఉన్నట్టు పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. జిల్లా ఆడిట్ అధికారి జయపాల్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ సుమతి, డ్వామా పీడీ శ్రీనివాస నాయక్, సభ్యులు ప్రసాద్ బాబు, వెంకటరమణ, మహేష్, సురేష్‌బాబు, ఎన్‌జీఓ మెంబర్లు రోప్ సంస్థ మునిచంద్రారెడ్డి, ప్రగతి వెంకటరమణ, ఏబీఎంఎం వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, కమిటీ సభ్యులు

న్యూస్‌రీల్

రేపు అండర్-23 మెన్ క్రికెట్ సెలెక్షన్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గరల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడా మైదానాల్లో అండర్-23 మెన్ క్రికెట్ సెలెక్షన్స్ జరగనున్నట్టు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాడ శ్రీనివాసులు తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు 01-09-2000 నుంచి 01-09-2007 మధ్య జన్మించిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 8 గంటలకు తెల్లని దుస్తులతో పాటు సొంత క్రీడా సామగ్రి, ఆధార్‌కార్డు, ఫార్మ్ 5, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరవ్వాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా క్రికెట్ కోచ్‌లు ఆర్‌కె.మురుగన్ 98490 26131, చిన్నబాబు 79818 80381 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏపీఆర్‌జేసీ దరఖాస్తుకు 24వరకు గడువు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉందని విశ్వం విద్యాసంస్థల అధినేత ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. మే 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022-23వ సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. సందేహాల నివృత్తికి 93999 76999, 86888 88802నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి



తిరుచానూరు పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుచానూరు(చంద్రగిరి): పోలీసులు, ప్రజల మధ్య మరింత సత్సంబంధాలు నెలకొనేలా ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత మెరుగుపరచాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన తిరుచానూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని అన్ని రకాల రికార్డులు, క్రైం రిపోర్టులు, బీట్ రికార్డు, సిబ్బంది వివరాలు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను భద్రపరిచిన తీరును పనిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఈస్ట్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ సుబ్రమణ్యం రెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, జగన్నాథరెడ్డి, వెంకటసుబ్బన్న తదితర సిబ్బంది ఉన్నారు.

స్విమ్స్‌కు కరూర్ వైశ్యా బ్యాంక్ విరాళం



బ్యాటరీ వాహనం తాళాన్ని అందజేస్తున్న దృశ్యం

తిరుపతి తుడా: కరూర్ వైశ్యా బ్యాంక్ యాజమాన్యం స్విమ్స్ ఆసుపత్రికి భారీ విరాళాన్ని అందజేసింది. టీటీడీ జేఈవో సదా భార్గవి చేతుల మీదుగా మంగళవారం బ్యాటరీ వాహనాలు, నీటి శుద్ధి యంత్రాలు మొత్తం రూ.71 లక్షల విలువ గల వాటిని బ్యాంక్ సీఈవో రమేష్ బాబు మరో దాత మీనా హేమచంద్ర అందించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, వైద్యాధికారులు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పది పబ్లిక్ పరీక్షలు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ ప్రధాన పరీక్షలు ఈ నెల 15వ తేదీ, ఒకేషనల్‌కు సంబంధించిన పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పది పబ్లిక్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 152 పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు, ఆరోపణలకు తావులేకుండా అధికారులు సజావుగా నిర్వహించారు. ఇందులో భాగంగా చివరి పరీక్ష అయిన ఓఎస్ఎస్‌సీ పేపర్-2/ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు సబ్జెక్టును 18పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు 1,293 మంది హాజరవ్వాల్సి ఉండగా వారిలో 68 మంది గైర్హాజరైనట్టు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు.

4 నుంచి పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో మే 4 నుంచి 6వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మే 3న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 5వ తేదీ ఉదయం 9.10 గంటలకు స్వర్ణ రథోత్సవం జరగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించనున్నారు. మే 2వ తేదీన ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు.



ఆర్జిత సేవలు రద్దు

వసంతోత్సవాల నేపథ్యంలో మే 2 నుంచి 6వ తేదీ వరకు కల్యాణోత్సవం, సహస్రదీపాలంకారసేవ, మే 3న అష్టోత్తర శతకలశాభిషేకం, మే 5న లక్ష్మీ పూజ ఆర్జితసేవలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ పేర్కొంది.

శ్రీవారి సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,828 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.5.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు ఉన్నవారికి సకాలంలో, లేనివారికి 10 గంటల్లో, ఎస్ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. కాగా, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధా నారాయణ మూర్తి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆమెకు లడ్డూప్రసాదాలు అందించారు.



ఆలయం వెలుపల సుధా నారాయణమూర్తి

ఆరోగ్యశ్రీలో క్యాన్సర్‌కు వైద్యం

తిరుపతి అర్బన్: క్యాన్సర్ వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చినట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం క్యాన్సర్ వ్యాధి నివారణ చర్యలపై వైద్యాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.నీ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్క్రీనింగ్ పరీక్షలకు టీటీడీ సహకారంతో పింక్ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోని శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరు ఏరియా ఆస్పత్రుల్లోనూ క్యాన్సర్ వ్యాధిని గుర్తించడానికి అవసరమైన పరీక్షలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. తిరుపతి జిల్లాలో స్విమ్స్, టాటా క్యాన్సర్ ఆస్పత్రి, ఎస్వీ మెడికల్ కళాశాల, జిల్లా అధికారులు సమన్వయంతో క్యాన్సర్ స్క్రీనింగ్ పైలెట్ ప్రాజెక్టును సమర్థవంతంగా చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, స్విమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, స్విమ్స్ సర్జికల్ ఆంకాలజిస్ట్, స్పెషల్ ఆఫీసర్ జయచంద్ర రెడ్డి, స్వీకర్ మెడికల్ సూపరింటెండెంట్ శివకుమార్, హీరానాథ్, రమణయ్య, హేమంత్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ స్విమ్స్ నాగరాజు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా గంగజాతర



ఆలయ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్

తిరుపతి కల్చరల్: వెయ్యేళ్ల చరిత్ర కలిగి తిరుపతి గ్రామ దేవతగా భక్తకోటి పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం గంగమ్మ ఆలయంలో చేపడుతున్న ఆలయ, రోడ్డు విస్తరణ పనులను మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగమ్మ జారతను రాష్ట్ర పండుగగా ప్రకటించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి ప్రజల కల సాకారం చేశారన్నారు. మే నెలలో గంగజాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. గంగమ్మ ఆలయ రహదారులను వెడల్పు చేసేందుకు ఈ ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆలయ మహా కుంభాభిషేకానికి ముందే అన్ని పనులు పరిపూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మే 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవం, 5వ తేదీన కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్ర సరస్వతీ స్వామి, పలువురు ముఖ్యులు హాజరు కానున్నారని తెలిపారు. అలాగే మే 9న తిరుపతి గంగమ్మ జాతర చాటింపు, 16న అమ్మవారి గంగజాతర జరుగుతుందన్నారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు, మున్సిపల్ ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, ఎంహెచ్‌వో హరికృష్ణ, ఏసీపీలు గుణశేఖర్, షణ్ముగం, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేతలు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, మురళి, తులసి, భరణి, మునిశేఖర్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.

నూతన వంగడాలతో సాగు విస్తీర్ణం పెంపు



మాట్లాడుతున్న తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి

తిరుపతి ఎడ్యుకేషన్: వాడుకలో ఉన్న వివిధ పంటల స్థానాల్లో పరిశోధనా స్థానాలు రూపొందించిన నూతన వంగడాలు తీసుకొచ్చి సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి తెలిపారు. పరిశోధనా స్థానంలో రెండు రోజులుగా నిర్వహించిన దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ మండలి సమావేశం మంగళవారం ముగిసింది. ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ, రైతుల అభ్యున్నతికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిరంతర కృషి చేస్తోందన్నారు. పరిస్థితులకు అనుగుణంగా లాభసాటి వ్యవసాయమే లక్ష్యంగా వర్సిటీ పనిచేస్తోందన్నారు. వర్సిటీ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతుల నుంచి విత్తనాలు కొనుగోలు చేసి, వాటిని శుద్ధి చేసి ఇతర రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విస్తరణ డైరెక్టర్ డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ నూతనంగా అభివృద్ధి చేసిన రకాలను ప్రభుత్వం నుంచి సబ్సిడీ ద్వారా రైతులకు అందించేలా చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల్లో మంచి పోషక విలువలున్నాయని, ప్రస్తుత ఆరోగ్య భద్రత కోణంలో ప్రతిఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని, వాటి ప్రాసెసింగ్, విలువ జోడించి మార్కెట్ డిమాండ్ కల్పించాలని కోరారు. సహపరిశోధనా డైరెక్టర్ డాక్టర్ సి.రమణ, శాస్త్రవేత్తలు, సలహా మండలి రైతు సభ్యులు, ఐదు జిల్లాల వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

తీర్మానాలు

- వేరుశనగ సాగులో పూర్తి యాంత్రీకరణ
- చీడపీడలను తట్టుకునే పంట రకాలను కేంద్రీయ విత్తన సంస్థలో నమోదు చేయడం
- పత్తి, మిరప పంటల కోట యంత్రాలను ఆవిష్కరించి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం
- వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై కృషి విజ్ఞాన, ఏరువాక కేంద్రాల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు
- వరిలో స్వల్పకాలిక సన్నగింజ, చీడపీడలను తట్టుకుని మార్కెట్ ధర అధికంగా ఉండే రకాల రూపకల్పన చేయడం
- మినుమ, పెసర పంటల్లో పల్లాకు తెగులు తట్టుకునే రకాలు, కందిలో గొడ్డు తెగులు తట్టుకునే నూనత రకాల రూపకల్పన
- చిరుధాన్యాలను బీడు భూముల్లో సాగుచేసి విస్తీర్ణం పెంచడం

ప్రకృతి ఉత్పత్తులకు నాబార్డు సాయం


తిరుపతి రూరల్: ప్రకృతి ఉత్పత్తులు, రైతుల మెరుగైన శిక్షణకు నాబార్డు సాయం అందిస్తుందని డీడీఎం సునీల్ తెలిపారు. తిరుపతి రూరల్ మండలం, వేమూరు పంచాయతీలో మంగళవారం తిరుపతి భూలక్ష్మి ప్రకృతి ఉత్పత్తిదారుల కంపెనీ(ఎఫ్‌పీఓ) ఏర్పాటు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎఫ్‌పీఓ వల్ల కలిగే ప్రయోజనాలు, రైతులు సభ్యత్వం తీసుకునే విధానం, ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదట ప్రకృతి వ్యవసాయదారులకు ప్రత్యేకమైన ఎఫ్ఈఓ ఏర్పాటు కావడం హర్షించదగ్గ అంశమన్నారు. ఈ కంపెనీ ద్వారా రైతులు విత్తనం, వనరులు, మార్కెట్ సౌకర్యం కల్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు మొదట రూ.100 ప్రవేశరుసుము కట్టాల్సి ఉంటుందని, తర్వాత రూ.1000తో వాటాదారులుగా నమోదు కావచ్చని చెప్పారు. సభ్యులకు అవసరమైన శిక్షణ, విజ్ఞాన యాత్రలు నిర్వహించడానికి నాబార్డు సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. వాటాదారులందరూ ఐక్యంగా ఉంటే పెద్ద ఎత్తున ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు. విచక్షణా రహితంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడుతున్నందున ఆరోగ్యం దెబ్బతింటోందని, సేంద్రియ కర్బనం తగ్గి దిగుబడులు కూడా తగ్గుతున్నాయని తిరుపతి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మనోహర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమ ప్రోత్సాహకులు, వర్ద్ కార్యదర్శి గంగాధారం మాట్లాడుతూ వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారపు ఉత్పత్తులను అందించేందుకు ఎఫ్‌పీఓ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. రైతులతో వినియోగదారులను అనుసంధానం చేసేందుకే ఎఫ్‌పీఓను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యానశాఖ అధికారి వెంకటసౌజన్య, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు పాల్గొన్నారు.



వేమూరులోఎఫ్‌పీఓని ప్రారంభిస్తున్న నాబార్డు డీడీఎం సునీల్, ఏడీఏ మనోహర్‌బాబు

క్లుప్తంగా

ఇంటికి విద్యుత్ సరఫరా రాలేదనీ..



స్తంభంపై వేలాడుతున్న భవానీశంకర్

పెళ్లకూరు: ఇంట్లోకి విద్యుత్ సరఫరా రాలేదని స్తంభం ఎక్కి వైర్లు సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పునబాక గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. పునబాక గ్రామానికి చెందిన కొమ్మతొట్టి భవానీశంకర్ అలియాస్ సుధాకర్(40) ఇంటికి సోమవారం రాత్రి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి ఇంటి సమీపంలో ఉన్న స్తంభం ఎక్కి వైర్లు మరమ్మతు చేస్తున్నాడు. అనుకోకుండా విద్యుత్ సరఫరా రావడంతో విద్యుత్ షాక్ తగిలి భవానీశంకర్ స్తంభం పైనే ప్రాణాలొదిలాడు. ఏఎస్ఐలు సుబ్రమణ్యం, శ్రీనివాసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాలుజారి పడి వ్యక్తి మృతి

నిండ్ర: కాలుజారి రెడ్డిగుంటలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రమైన నిండ్రలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని మిట్టకండ్రిగ దళితవాడకు చెందిన టి.శీనయ్య(60) నిండ్రలోని బంధువుల శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి రెడ్డిగుంటలో దిగాడు. కాలుజారడంతో గుంటలో పడిపోయి మృతిచెందాడు. మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజాస్వామ్య పాలన జగనన్నతోనే

- తండ్రి బాటలో పయనిస్తున్న మోహిత్‌రెడ్డి
- మహాపాదయాత్రకు విశేష స్పందన



గడపగడపకు మహా పాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి సంఘీభావంగా అడుగులో అడుగు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి

భాకరాపేట: సీఎం జగనన్నతోనే నిజమైన ప్రజాస్వామ్యపాలన అని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఎర్రావారిపాళెం మండలం, నెరబైలు పంచాయతీలో మహా పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రూ.లక్షకు తక్కువ లేకుండా లబ్ధిపొందారని, సీఎం జగజగనన్న పాలనలో ప్రతి పేదవాడికీ ఆర్థిక భరోసా లభించిందన్నారు. పల్లెలు ప్రగతి బాటలో పయనించేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా నిధులు విడుదల చేశారని కొనియాడారు. సీఎం ఆశయాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆలోచనలకు అగుణంగా పనిచేస్తానని, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం ఊటబావులపల్లెకి చెందిన విద్యార్థిని మాధురి తాను జిల్లా స్థాయిలో ఫుట్‌బాల్ ఆడుతున్నట్లు మోహిత్‌రెడ్డికి తెలియజేయగా తాను క్రీడలకు అవసరమైన సామగ్రి అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నెరబైలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు.

మాజీ ఎమ్మెల్యే సంఘీభావం

తిమ్మాడివాండ్లపల్లెలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మహా పాదయాత్ర కార్యక్రమానికి పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల పనితీరును వివరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డి చేపట్టిన మహా పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మోహిత్‌రెడ్డి విజయం సాధించాలని ఆశీర్వదించారు.

అడుగడుగునా అపూర్వ ఆదరణ

మహాపాదయాత్ర నెరబైలు పంచాయతీ తిమ్మాడివాండ్లపల్లె, చల్లకుంట హరిజనవాడ, తోటి హరిజనవాడ, మడితాటివారిపల్లె, కందలమాదిగపల్లె, నెరబైలు, బజారువీధి, వెంకటాపురంకాలనీ, నెరబైలు, నాయనవారిపల్లె, సంతగేటు, ప్రాంతాల మీదుగా సాగింది. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు హారతులు పట్టి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఎంపీపీ శివలక్ష్మి, సర్పంచ్ దేవేంద్ర, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మండల పరిశీలకులు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మండల ఇన్‌చార్జి చెంగల్‌రెడ్డి, మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, సచివాలయం కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, తలకోన బోర్డు సభ్యులు నాగార్జున, జయంత్, రాజేశ్వరి, సహదేవరెడ్డి, బోమ్మాజి కిశోర్, కొటిరెడ్డి, నాగరాజ, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పోరాటాలకు సన్నద్ధం చేద్దాం



మాట్లాడుతున్న ప్రదీప్

తిరుపతి కల్చరల్: ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్ పిలుపు నిచ్చారు. ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభల నేపథ్యంలో చివరి రోజు మంగళవారం ఐదేళ్ల ఉద్యమ నివేదికపై వివిధ రాష్ట్రాల ప్రతినిధులు సుమారు 36 మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చివరగా ఐఎఫ్‌టీయూ జాతీయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

షుగర్ ఫ్యాక్టరీ లిక్విడేటర్‌గా రవిబాబు



తిరుపతి అర్బన్: శ్రీవెంకటేశ్వర కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ లిక్విడేటర్‌గా(పరిసమాప్తం చేయు అధికారి) రవిబాబును నియమిస్తూ షుగర్‌కేన్ కమిషనర్ వి.వెంకటరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలుచోట్ల ఆయన కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ లిక్విటేటర్‌గా పనిచేశారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,340
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,568

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,600
రిటైల్ వెండి గ్రాము	రూ.78.60

ట్రాయ్ సభ్యుడిగా చిట్టిబాబు



తిరుపతి అర్బన్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కేంద్ర సభ్యుడుగా తిరుపతికి చెందిన పావులూరి చిట్టిబాబు వరుసగా 6వ సారి నియమితులయ్యారు. ఈ మేరకు ఢిల్లీ ట్రాయ్ డెప్యూటీ అడ్వైజర్ మన్మోహన్ వ్యాస్ ఉత్తర్వులు జారీచేశారు. సాధారణంగా సభ్యత్వ కాలం రెండేళ్ల పాటు కొనసాగుతుంది. గత పదేళ్లుగా చిట్టిబాబు ట్రాయ్ సభ్యుడుగా కొనసాగుతున్నారు. చిట్టిబాబు 2025 మార్చి 31 వరకు ఈ పదవిలో కొనసాగుతారు.

కల్లుగీసి ఇంటికి వస్తూ..



మృతి చెందిన వెంకయ్య

చిల్లకూరు : కల్లు గీసుకుని తిరిగి ఇంటికి బైక్‌పై వస్తున్న వ్యక్తిని లోడ్డుతో వెళుతున్న లారీ ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిల్లకూరు మండలం, చింతవరం గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. మండలంలోని ఏరూరు అల్లీపురం గ్రామానికి చెందిన గోను వెంకయ్య (58) కల్లు గీసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలోని తాటి చెట్ల నుంచి కల్లు దించి చింతవరం గ్రామంలో విక్రయించి తిరిగి ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో వరగలి వైపు నుంచి పుచ్చకాయల లోడ్డుతో చింతవరం వైపు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకయ్యకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అతనిని సమీపంలోని చింతవరం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. పోలీసులు వివరాలను సేకరించారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నీళ్లిచ్చిన వారిపై నిందలా?

టీడీపీ నేతలపై మండిపడ్డ తారకరామానగర్ వాసులు

రేణిగుంట: 'ఏనాడూ మా బాగోగులు పట్టించుకోని వారు ఇప్పుడు మాకు గుక్కెడు తాగునీరిచ్చిన వారిపై నిందారోపణలు చేయడం విడ్డూరంగా ఉంది'అని మండలంలోని తారకరామానగర్ వాసులు టీడీపీ నాయకులపై మండిపడ్డారు. మంగళవారం కాలనీలో మహిళలు నీటి కొళాయిల వద్ద టీడీపీ నియోజకవర్గ నేత బొజ్జల సుధీర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ కాలనీని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని చెప్పి ఆయన తండ్రి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కనీసం వసతులు కూడా కల్పించలేదని మండిపడ్డారు. ఇన్నాళ్లూ తాగునీటిని కూడా టీడీపీ నాయకులు వాటర్ క్యాన్ల రూపంలో డబ్బులకి అమ్మి సొమ్ముచేసుకున్నారని ఆరోపించారు. తమ మొర ఆలకించి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పైప్‌లైను వేసి ఇంటి వద్దకే తాగునీటిని అందించడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ నాయకుడు బుజ్జిరెడ్డి ఇక్కడి పేదల ఇళ్లను ఆక్రమించి అమ్ముకోవడంతోపాటు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేశాడని ఆరోపించారు.



టీడీపీ నాయకుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

దూసుకొచ్చిన లారీ

- స్టీరింగ్ లాక్ అయ్యి అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు
- మామిడి తోటలో పల్టీలు
- డ్రైవర్ సహా 10 మందికి గాయాలు
- తప్పిన పెనుముప్పు
- క్షతగాత్రులకు పరిహారం అందించిన ఆర్టీసీ అధికారులు



క్షతగాత్రులను తరలిస్తున్న 108 సిబ్బంది



బోల్తాకొట్టిన ఆర్టీసీ బస్సు

తిరుపతి రూరల్: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించేందుకు అకస్మాత్తుగా ఓ లారీ కుడి వైపు నుంచి ఎడమవైపు ఉన్న ఆర్టీసీ బస్సు లైన్‌లోకి వచ్చేందుకు ప్రయత్నించింది. బస్సుకు తగలడం, డ్రైవర్ కాలు ఎక్స్‌లేటర్ వద్ద ఇరుక్కుపోవడం, స్టీరింగ్ లాక్ అయ్యింది. బస్సు అదుపు తప్పడం, పక్కనే ఉన్న విద్యుత్ పోల్‌ను ఢీకొట్టి మామిడి తోటలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టడం క్షణాల్లో జరిగిపోయింది. ఈప్రమాదంలో డ్రైవర్‌తో పాటు 10 మందికి గాయాలు అయ్యాయి.

ప్రమాదం ఎలా జరిగిందంటే?

చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం తిరుపతి నుంచి చిత్తూరుకు 35 మంది ప్రయాణికులతో వెళ్తోంది. చంద్రగిరి మండలం కొంగరవారిపల్లి సమీపంలో పక్కను వస్తున్న లారీ ఆకస్మికంగా దూసుకురావడం, డ్రైవర్ వైపు లారీ తగలడంతో రేకులు డ్రైవర్ మణి కాలికి ఒత్తుకున్నాయి. దీంతో కాలితో బ్రేకులు వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. లారీ తగలడంతో స్టీరింగ్ లాక్ అయిపోయింది. క్షణాల్లో బస్సు అదుపుతప్పి జాతీయ రహదారికి పక్కను ఉన్న మామిడి తోటలోకి దూసుకెళ్లింది. రోడ్డుకు, తోటలకు మధ్య నాలుగు అడుగుల లోతు ఉండడంతో బస్సు బోల్తాపడింది. దీంతో డ్రైవర్ మణి, కండక్టర్ చెంగ్రాయులుతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 10 మందికి గాయాలు అయ్యాయి. డ్రైవర్ మణి కుడికాలు విరిగింది. స్థానికుల సమాచారంతో 108 వాహనాల్లో గాయపడిన వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి చేర్చి, చికిత్స అందించారు. డిపో మేనేజర్ కృష్ణమూర్తి క్షతగాత్రులను పరామర్శించి, గాయపడిన వారికి రూ.2వేల చొప్పున పరిహారం అందించి ఓదార్చారు. ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సును రవాణా శాఖాధికారులు తనిఖీలుచేశారు. స్టీరింగ్ లాక్ అయినట్లు గుర్తించారు. అయితే హ్యాండ్ బ్రేక్ ఉన్నా కూడా ఉపయోగించకపోవడంపై డ్రైవర్ మణిని ఆర్టీసీ, రవాణాశాఖాధికారులు ప్రశ్నించారు. పెనుముప్పు తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

మల్లాడి డ్రగ్స్ కర్మాగారంలో అగ్నిప్రమాదం

- ఒకరికి గాయాలు
- రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం



కర్మాగారంలో ఎగసిపడుతున్న మంటలు

రేణిగుంట: గాజులమండ్యం కెమికల్ ఎస్టేట్‌లో ఉన్న మల్లాడి డ్రగ్స్ కర్మాగారంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ప్లాంటు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. ఒక కార్మికునికి గాయాలు కాగా, రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. గాజులమండ్యం ఎస్టేట్‌లోని మల్లాడి డ్రగ్స్ కర్మాగారం సాల్వెంట్ ప్లాంటులో మంగళవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. అక్కడ పనిచేస్తున్న వారంతా భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. గాజులమండ్యం తూర్పు వీధికి చెందిన నక్కల సాయికిషోర్(27)కు మంటలు అంటుకుని వీపు భాగం కాలింది. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం రేణిగుంట సమీపంలో ఉన్న అమర ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని అగ్నిమాపక అధికారుల సమన్వయంతో హుటాహుటిన అగ్నిమాపక వాహనాలను రప్పించారు. ఆ ప్లాంటులో ఉన్న రసాయనాల మంటలు నీరు పోస్తే ఇంకా ఎక్కువయ్యే గుణం ఉన్నందున నాలుగు గంటలకు పైగా శ్రమించి అధికారులు చాకచక్యంగా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రమాదానికి కారణాలేవో అంతుచిక్కడం లేదని కంపెనీ యాజమాన్యం తెలిపింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు వివరించారు. ఇటీవల రేణిగుంట సమీపంలోని పలు కర్మాగారాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ చర్యల గురించి ఆయా కంపెనీలు ఏ మేరకు నిబంధనలు పాటిస్తున్నాయో అధికారులే తేల్చాల్సి ఉంది.

పథకాలపై అవగాహన కల్పించండి



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



హాజరైన బ్యాంకర్లు

తిరుపతి అర్బన్: కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతికి సంబంధించి పంచాయతీ స్థాయిలో ఏప్రిల్ 4 నుంచి జూన్ 30వ తేదీవరకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జనసురక్ష కార్యక్రమంపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకానికి సంబంధించి 18– 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ప్రతి సంవత్సరం రూ.436తో ఆటో డెబిట్ ద్వారా రెండు లక్షల రూపాయల బీమా పొందవచ్చన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి 18– 70 ఏళ్ల వయస్సు వారు అర్హులని, ఏటా రూ.20తో రెండు లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చని చెప్పారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో బ్యాంకర్లు, సంబంధిత అధికారుల సహకారంతో పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మార్చి 29 నుంచి ఏప్రిల్ 9 వరకు సరస్ పేరుతో 2022–23 డ్వాక్రా ప్రదర్శనను బాధ్యతగా తీసుకొని విజయవంతం చేసిన అధికారులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథ రామిరెడ్డి, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జయకుమార్, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అరుణ, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ శైలేంద్ర, నాబార్డ్ ఏజీఎం సునీల్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి

పాకాల: పాకాలలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి సమక్షంలో మాజీ ఎంపీటీసీ కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం మాజీ ఎంపీటీసీ ప్రభావతి, ఆమె భర్త కాముడు తమ అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి జెడ్పీటీసీ సభ్యురాలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే చర్చి కమిటీ చైర్మన్ ఆంథోని, అతని కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నంగాబాబురెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యంకస్తూరి, సుధాకర్, మధుసూదన్, మురళి, నితిన్‌రెడ్డి, శేఖర్, ముషీర్ పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



లక్ష్మీనారాయణ(ఫైల్)

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని పాగొట్టం కాలనీ సమీపంలో విన్నమాల సప్లయ్ చానల్‌లో పడి ఇందుకూరు లక్ష్మీ నారాయణ(38) మృతిచెందాడు. వివరాలు.. పట్టణంలోని అమరాగార్డెన్ వీధిలో లక్ష్మీనారాయణ, తల్లి హంసమ్మతో పాటు 7వ తరగతి చదువుతున్న కుమార్తె వందనతో కలిసి నివాసం ఉంటున్నారు. లక్ష్మీనారాయణ లారీ క్లీనర్. ఈక్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మీ నారాయణ రాత్రి వరకు తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం పాగొట్టం కాలనీ సమీపంలో లక్ష్మీనారాయణ మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ విజయభాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీనారాయణ మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తే కారణమని అనుమానం వ్యక్తం చేశారు.

24 నుంచి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 24వ తేదీ సోమవారం సాయంత్రం అంకురార్పణంతో ప్రారంభమవుతాయని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఆలయంలో పునఃనిర్మాణ పనుల కారణంతో మూడేళ్ల తర్వాత వార్షిక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం సముదాయం గ్రామ వీధుల్లో వాహన సేవలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు.

జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే!



సీఎం జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

నాయుడుపేటటౌన్: సీఎం జగనన్న ఎదైన చెప్పాడంటే.. చేస్తాడంతే అని నాయుడుపేట పట్టణంలో తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన నాయీ బ్రాహ్మణులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మూడు జిల్లాలకు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘ నాయకుల సారథ్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ముందుగా నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య చిత్రపటాలతో ఉన్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నాయీబ్రాహ్మణలకు దుకాణాలు నడుపుకునేందుకు ప్రతి ఏటా రూ.10వేలు, 150 యూనిట్ల వరకు విద్యుత్ అందిస్తున్నారని తెలిపారు. అలాగే కులధూషణలు చేయకుండా ప్రత్యేక చట్టం రూపొందించారని చెప్పారు. దేవాలయాలయ పాలక మండలి కమిటీల్లోనూ నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం కల్పించారని గుర్తుచేశారు. ఈసారి మళ్లీ సీఎం జగనన్నే రావాలని ఆకాంక్షించారు. నాయుడుపేటకు చెందిన నాయీ బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్యదర్శి ముద్దాపాటి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మూడు జిల్లాలకు చెందిన నాయకులు, నెల్లూరు రాజు, పాకాల సురేంద్ర, యాకసిరి గోపాలయ్య, నారాయణ, ఎం గురుమూర్తి, సీ భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.